# తీరిన కోరిక

రచన :
కుమారి ఎం. రమణమ్మ

వీధిలో రిక్షా ఆగిన చప్పుడు వినడంతో ఎవరొచ్చారో చూద్దామని సుశీల వీధి గుమ్మంలోనికి వచ్చింది.

అప్పుడే పరంధామయ్యగారు రిక్షాదిగి రిక్షావాడికి డబ్బులిచ్చేసి బ్యాగ్‌ను చేతిలో పట్టుకుని లోనికి వస్తున్నారు.

సుశీల తండ్రి కెదురు వెళ్ళి నవ్వుముఖంతో 'నాన్నగారూ! బాగున్నారా? అమ్మా వాళ్ళు కులాసా' అంటూ తండ్రి చేతిలోని బ్యాగును తీసుకుని 'రండి' అంటూ తండ్రిని ఆప్యాయంగా పలుకరించి లోనికి తీసుకు వెళ్ళింది.

'ఏమ్మా! అల్లుడు ఇంకా ఆఫీసునుంచి రాలేదా?' లోనికివస్తూ అన్నారు పరంధామయ్యగారు.

'వచ్చేరు. బాత్‌రూంలో ముఖం కడుక్కుంటున్నారు. కూర్చోండి నాన్నా. కాఫీ తెస్తాను' అని చెప్పేసి తన చేతిలోని బ్యాగ్‌ను గదిలో పెట్టడానికి లోనికి వెళ్ళింది.

'పండుగ వస్తున్నాది కదూ. మనల్ని పిలవడానికి మా నాన్నగారు వచ్చేరు.' అంది బ్యాగ్‌ను టేబిల్ మీద వుంచుతూ. ఆ క్షణంలో ఆమె ముఖం సంతోషంతో మతాబులా వెలిగిపోతున్నాది.

అద్దం ముందు నిల్చొని తలదువ్వుకుంటున్న భాస్కర్ ప్రక్కకు తిరిగి భార్యవైపు చూస్తూ 'ఓహో! అదా అదా సంగతి. ఏమిటో గొప్ప విషయం అనుకున్నాను' అన్నాడు హేళనగా.

'మన పంతాలు, పట్టుదలలు ఆ తర్వాత. ముందు అతనిని పలుకరించి రండి బాగుండదు' అని చెప్పేసి టక్కున అక్కడినుంచి వంటింట్లోకి వెళ్ళిపోయింది సుశీల.

భాస్కర్ తల దువ్వుకోవడం పూర్తిచేసి షర్టు తొడుక్కొని 'మంచిమామగారినే సంపాదించేను' అని లోన సణుక్కుంటూ బయటకు మాత్రం నవ్వుతూ 'మామగారూ! బాగున్నారా?' అంటూ హాలులోనికి వచ్చేడు. అతని ముఖంలో అతిశయం, గర్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

'బాగున్నాను...రా...కూర్చో' అంటూ ఎంతో ఆప్యాయంగా పలుకరించి తన ప్రక్కనేవున్న కుర్చీ చూపించేరు పరంధామయ్యగారు.

భాస్కర్ మరేమీ మాట్లాడకుండా ఆ కుర్చీలో కూర్చుని దిక్కులు చూడడం మొదలు పెట్టేడు. మామగారు ఏవి మాట్లాడినా ఇబ్బందిగా ముఖం పెట్టి 'ఊ' అనడం తప్ప మరేం మాట్లాడంలేదు. అతనికి మామగారి ఎదుట కూర్చోవడం ముళ్ళమీద కూర్చున్నట్లే అనిపించింది. ఎంత త్వరగా ఇక్కడినుంచి బయట పడతానా అని ఆలోచిస్తూ ఆ సమయంకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

ఇంతలో సుశీల రెండు గ్లాసులతో కాఫీ తెచ్చి ఇద్దరికి అందించింది.

'అమ్మా! సుశీలా! నువ్వు కాఫీ చాలా బాగా చేసేవమ్మా' అంటూ రెండుగుటకల్లో కాఫీగ్లాసును ఖాళీచేసేసేరు పరంధామయ్యగారు.

భాస్కర్ కొంచెం కాఫీ త్రాగి బయటకు ఉమ్మేస్తూ 'ఛీ! ఇది కాఫీయా? మురుగ నీళ్ళా? ఇలాగే కాఫీ పెట్టటం? నీకు కాఫీ పెట్టడం వచ్చి చస్తేకదూ' అంటూ మామగారు ఎదురుగుండా వున్నారు ఏమైనా అనుకుంటారేమోనన్నమాటే మరచిపోయి కోపంగా కాఫీగ్లాసును విసురుగా సుశీలమీదికి విసిరేసేడు.

వెంటనే సుశీల కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగిపోయేయి. విచారాన్ని సూచిస్తున్నట్లుగా ముఖం చిన్నబోయింది. ఎవరో తనను అవమానించినట్లుగా ఫీలై తండ్రిముఖంలోనికి చూడలేక తలవంచేసుకుంది. వస్తున్న దుఃఖాన్ని మునిపంటితో లోలోనే అణుచుకుంటూ ఆమె భర్తకేమీ సమాధానం చెప్పకుండా మౌనంగా ఒంటిమీద పడిన కాఫీని చీరకొంగుతో తుడుచుకుని కాఫీ గ్లాసులను పట్టుకుని లోనికి వెళ్ళిపోయింది.

పరంధామయ్యగారు పైకి అల్లుడికేమీ సమాధానం చెప్పలేక, కంఠంలో దాచుకోలేక లోనే గుటకలు మ్రింగుతున్నారు. గుడ్లప్పగించి అల్లుడిని చూడడం తప్ప మరేం చేయలేక పోయేరు. ఎప్పుడూ ప్రాణపదంగా చూసుకునే అల్లుడిమీద ఎందుకనో ఆయనకు ఈరోజు చాలాకోపం వచ్చేసింది. అయినా అల్లుడిమీద అధికారం చెలాయిస్తే బాగుండదని నోరుమూసుకుని వూరుకున్నాడు.

కామాక్షిని కన్న తల్లి దండ్రులకంటె ఎక్కువగా, సుశీలను, అపురూపంగా చూసుకునే భాస్కర్ ఏమిటింత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడు? ఏమిటీ ఆకస్మిక మార్పు ఒక ప్రక్క ఆశ్చర్యం, మరొక ప్రక్క అనుమానం మిళితమై అతని మెదడును కలతర పెట్టసాగేయి.

'నాకు బయట అర్జెంటు పనుంది, మళ్ళీ త్వరగా వచ్చేస్తా'నని మామగారితో పొడిపొడిగా మాట్లాడేసి అక్కడినుంచి లేచిపోయి గదిలోనికి వెళ్ళి ఐదునిముషాలలో డ్రస్సు చేంజి చేసుకుని బయటకు వెళ్ళిపోయేడు భాస్కర్.

'నాన్నగారూ! స్నానం చేద్దురుగాని రండి. బాత్ రూంలో నీళ్లు పెట్టేశేను. ఈ టవల్ తీసుకోండి' తన చేతిలోని టవల్‌ను తండ్రికిచ్చింది సుశీల.

పరంధామయ్యగారు టవల్‌ను అందుకుంటూ 'ఏమ్మా! అల్లుడేమిటి అంతకోపంగా వున్నాడు. మీరిద్దరూ దెబ్బలాడుకున్నారా?' అన్నాడు కూతురు వెనకే లోనికి నడుస్తూ. అతను యాంత్రికంగా నడుస్తున్నాడేగాని అతని మనస్సులో అల్లుడు కోపానికి గల కారణమేమిటో తెలిసికోవాలనే ఆతృతను అణచుకోలేక పోతున్నాడు.

'లేదు నాన్నగారూ! మీరు స్నానంచేసి రండి' అంటూ తండ్రి ఇంకేమి ప్రశ్నలు వేస్తాడోనని గాబరా పడిపోతూ గబగబా అక్కడినుంచి ఏదో అర్జెంటుపని వున్నట్లుగా మరొకగదిలోనికి వెళ్లిపోయింది సుశీల.

*          *          *          *

సాయంత్రమనగా వెళ్లిపోయిన భాస్కర్ తొమ్మిదైనా ఇంటికి రాలేదు. పరంధామయ్యగారు, సుశీల భోజనాలు చేయకుండా హాలులో కూర్చుని భాస్కర్ కోసం ఎదురు చూస్తున్నారు ఏదో కబుర్లు చెప్పుకుంటూ.

తొమ్మిదింపావు అయినతరువాత భాస్కర్ వచ్చేడు.

లోనికి వస్తూనే చాలా లేటయినట్లుంది కదూ అని తనలో తానే వారిద్దరికీ వినిపించేటట్లుగా అనుకొని కొశ్చన్ మార్కులా వున్న మావగారి ముఖంవైపు చూసి గదిలోనికి వెళ్లి కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటున్నాడు.

ఇంతలో సుశీల గదిలోనికి వచ్చింది. తనూ ఒక కుర్చీలో కూర్చుంటూ 'మా నాన్నగారు ట్రైన్ ప్రయాణంవలన మధ్యాహ్నం భోజనం చేయలేదట. ఇప్పుడు పెందరాళే భోజనం చేయమంటే అల్లుడితో కలిసి తింటానులే అని చెప్పేరు త్వరగా రండి' అంది ప్రాధేయపడుతున్నట్టుగా. ఆమె మనసులో తండ్రి చాలా ఆకలితో వున్నాడని బాధపడుతూన్నది. ఎప్పుడూ ఐదుగంటలకే ఇంటికి వచ్చేసి, ఇల్లు కదలని భాస్కర్ ఆ రోజు కావాలనే రాత్రివరకూ ఎక్కడెక్కడో తిరిగి ఆలస్యంగా వచ్చేడు.

'ఓహో! అలాగా' అనేసి విప్పినబూట్లను స్టాండు దిగువన పెట్టేసి రేడియో వేసుకుని హిందీపాటలువింటూ కూర్చున్నాడు. ఈ వేళ ఏలాగైనా ఆలస్యం చేయాలి అని మనసులో మరొకసారి దృఢనిశ్చయం చేసుకున్నాడు.

'ఏమండీ! వడ్డించేసేను రండి' వంటింట్లోనుంచి గట్టిగా ఒక్క కేక పెట్టింది సుశీల.

ఇంక భోజనానికి వెళ్ళకపోతే బాగుండదనుకొని వెంటనే రేడియోను ఆపుచేసేసి డ్రస్సు చేంజి చేసుకుని గబగబా రెండు చెంబులు నీళ్ళు కాళ్ళమీద కుమ్మరించేసుకుని వంటింట్లో ప్రవేశించేడు భాస్కర్.

'భాస్కర్! నీవు వారంరోజులు సెలవుపెట్టి అమ్మాయిని తీసుకుని పండక్కి అక్కడికి వచ్చేయి. నేను రేపు దయం బండికి వెళ్లిపోతున్నాను. రావడం మానేయకండి' అన్నారు పరంధామయ్యగారు భాస్కర్ వైపు చూస్తూ.

ఎందుకు ఇంకా? నాకు పండుగ ప్రజెంటేషన్ చేయడానికి ఏమైనా సెకెండు హాండువి కొని వుంచేరా ఏమిటి? అని మనసులో అనుకుని 'అలాగే' ప్రయత్నిస్తాను అని ముక్తసరిగా జవాబిచ్చేసి కంచంలో చేయి కడిగేసుకుని అక్కడినుంచి లేచి వెళ్ళిపోయేడు భాస్కర్.

*          *          *          *

'మీరు. రేపే సెలవుకు అప్లై చేయండి'

'ఎందుకు'

'ఎందుకేమిటి? నాన్నగారు పండక్కి పిలిచేరుగా. మనం వెళ్ళొద్దు అందుకని' ముక్తసరిగా జవాబిచ్చింది సుశీల.

వాతావరణం చాలా ప్రశాంతంగా వుంది ఆకాశమంతా బంగారపు బుటాలున్న పట్టుచీరెలా నక్షత్రాలలో తళతళ మెరసిపోతున్నాది. చంద్రుడు తన చల్లదనాన్ని, కాంతిని భూమిమీద కుమ్మరిం చేస్తున్నాడు. ప్రకృతింతా చంద్రకాంతితో నిండిపోయి చాలా మనోహరంగా వుంది. గాలికి పెరట్లోవున్న నైట్ క్వీన్, సన్నజాజుల సువాసన గది అంతా వ్యాపించేస్తున్నాది.

నేనిక కదనరంగంలో అడుగుపెట్టి మామగార్ని కూడలు కొట్టేయ్యాలి అని భాస్కర్ మనసులో ఒక్కసారి నిశ్చయించుకుని 'నీవు వెళితే వెళ్లు. నేను మాత్రం రాను' హాలులో కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న మామగార్కి వినిపించేలా తలుపు దగ్గరికివచ్చి గట్టిగా అన్నాడు భాస్కర్.

'అదేంటండీ మానాన్నగారు అంత దూరంనుంచి వచ్చి మనల్ని అంత ఆప్యాయంగా పిలిస్తే...'

'ఎందుకు పిలవడం? అల్లుడికి ఖరీదైన సూటు పెట్టాలా! ట్రాన్సిస్టర్ పెట్టాలా! క్రిందటిసారి సంక్రాంతి పండుక్కి మీ నాన్న పెట్టేడుకదూ బోడి సెకెండు హాండు వాచి. అది మా ఆఫీసులోవాళ్లు చూసి ఎంతలా నవ్వేరో తెలుసా? నాకు తలతీసేసినంత పనయింది. అప్పుడే ఒట్టుపెట్టుకున్నాను. జన్మలో అత్తవారింటికి వెళ్ళకూడదని. తన వాయిస్‌ను రెట్టించేడు భాస్కర్.

ఇంతలో సుశీల ఏదో చెప్పబోయింది.

భాస్కర్ వెంటనే వాదిస్తూ 'నువ్వు వెళ్లితే వెళ్లు. నేను మాత్రం రాదలుచుకోలేదు' భాస్కర్ నోటినుంచి కచ్చితంగా వచ్చిందా మాట.

'మీరు రాకుండా నేను వెళ్ళను. మీరు కూడా రండి ప్లీజ్' అర్థిస్తున్నాది సుశీలా.

'అయితే నువ్వుకూడా వెళ్ళడం మానేయి' అని సుశీలకు కటువుగా సమాధానం చెప్పేసి మామగారు వింటున్నారో లేదో అని సగం కర్టెన్ తొలగించి తలుపు సందులో నుంచి చూసేడు. కోపం, ఆవేశం, గర్వం, అసూయ అతని ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

అప్పటికే పరంధామయ్యగారు చదువుతున్న పేపరును మడచేసి అల్లుడు, కూతురుల సంభాష వింటున్నాడు దీనంగా ముఖంపెట్టి. అతని ముఖం డబిల్ రోస్టు పెసరెట్టులా మాడిపోయి కళావిహీనమైపోయింది. తన సోడాబుడ్డి కళ్ళద్దాలను ఇటూ అటూ సవరించుకుంటూ ఆ తలుపు వైపే చూస్తున్నాడు. మామగారి అవస్థ చూసి భాస్కర్‌కు జాలివేసింది. జాలిగా వుంటే ఈ మావగార్లు అల్లుళ్ళను భూమిలోనికి అణచేస్తారు అని మనస్సును వెంటనే కఠినంగా మార్చుకుని_

'సుశీలా! క్రిందటిసారి పండక్కి చూడు మీనాన్న మీ చెల్లెలు భర్తకి పెద్ద వుద్యోగస్థుడని ఖరీదైన సూటు, ట్రాన్సిస్టర్ పెట్టేడు. నాకో? నేను గుమస్తా గిరివని సూటు, సెకెండు హాండు వాచీ నా ముఖాన పడేసేడు. ఈసారి నేను రిటైరై పోయేను, నేను ఏమి పెట్టలేను, ఏమీ అనుకోకు బాబూ అంటూ మంచి మాటల బట్టలు పెట్టి సాగనంపుతాడు. అదేం కుదరదు. ఈసారి ట్రాన్సిస్టరు ఇస్తేనే మీ అల్లుడువచ్చేదీ...నన్ను పంపేదీ అని గట్టిగా మీ నాన్నతో చెప్పు తెలిసిందా?' తన మనసులోని మాట మామగార్కి తెలిసేలా గట్టిగా అన్నాడు.

ఆడపిల్లల తండ్రిని, అల్లుళ్లు ఏమన్నా పడాల్సిందే. కాలం మారిపోయింది. అల్లుళ్ళు కూడా మారిపోతున్నారు, అని మనస్సులో చిన్నగా అనుకున్నారు పరంధామయ్యగారు. తనలో తానే యోగిలా చిన్న చిరునవ్వు నవ్వుకున్నారు.

'ఏమండీ! మెల్లిగా మాట్లాడండి. మా నాన్నగారు వింటే బాధపడతారు. మీకు ఏమి కావాలో మానాన్నగారి ముఖంమీద అడిగేయాలి కాని...ఇలా అతన్ని చులకనగా నాదగ్గర మాట్లాడకండి' కొంచెం దురుసుగా గురిచూసి వదలిన బాణంలా దూసుకు వచ్చింది సుశీల నోటినుంచి,

'నోర్మూయ్! నువ్వు నన్నే ఎదిరిస్తున్నావు. సుశీల చెంప చెళ్లుమంది. నీకు మీనాన్న మీద అంత అభిమానం వుంటే పుట్టింటి వెళిపోయి అక్కడేవుండిపో మరిరాకు' ఆవేశంగా అన్నాడు భాస్కర్.అతని ముఖం కోపంతో ఎర్రబడి కళ్లు నిప్పుకణాల్లా తయారయేయి.

'మీరు రాకపోతే నేనూ వెళ్లను. నాకే పండుగలు వద్దూ, పబ్బాలువద్దూ. ఆ పండుగేదో మనింట్లోనే చేసుకుందాము లెండి. క్రిందటిసంవత్సరం మానాన్న ఇద్దరి అల్లుళ్ళ మధ్య చూపిన పక్షపాతం తల్చుకుంటే మరి నాకు ఈ సంవత్సరం వెళ్ళ బుద్ధికాలేదు. కాని తండ్రి అంత దూరంనుంచి వచ్చేరుకదా అని జాలివేసి'...... దుఃఖంతో కంఠంపూడి పోవడంతో మరేమి చెప్పలేకపోయింది.

'ఏం...మీ నాన్న అంతదూరంనుంచి వచ్చి పిలిచేరని జాలిపడుతున్నావా? అదేం కుదరదు. ఈమారు పండుకి మన ప్రయాణం హైదరాబాద్. తెలిసిందా? నీవే స్వయంగా మావాళ్ళు వున్నది వున్నంతలో అప్పైనా చేసి మా బావగార్కి పండక్కి ఏమిటి పెడతారో చూద్దువుగాని' కోపంగా అన్నాడు భాస్కర్.

ఆ మాట విన్నదే తడవుగా పరంధామయ్యగారు గబగబా గదిలోనికి పరుగెత్తుకొచ్చి, 'భాస్కర్! ఆమాయినేమీ అనకు. నీ కోరిక ప్రకారమే నేను ట్రాన్సిస్టర్ కొని ఇస్తాను. మీ యిద్దరూ యింక పోట్లాడుకోకండి.' అని అల్లుడిని, కూతురిని సమాధానపరచి అల్లుడు పండక్కివస్తాను అని ఒప్పుకొనే వరకూ భాస్కర్‌ను బ్రతిమాలడం మానలేదు. పాపం ఆ ముసలిప్రాణం అల్లుడు పండక్కి కూతుర్ని పంపననగానే కటకటలాడిపోయింది. అల్లుడిని బ్రతిమలాడ ఒప్పించేసరికి ప్రాణం పోయినంత పనయింది. గొంతు ఎండిపోయింది. నాలుక పిడచకట్టుకు పోయింది. శరీరమంతా చెమటపట్టేసి ఊపిరాడనట్లుగానే ఫీలయ్యేడు.

మరునాడుదయం పరంధామయ్యగారు స్టేషన్‌కు బయలుదేరుతూ 'మీ యిద్దరూ వచ్చేయండి' అని మరోసారి అల్లుడితో చెప్పేసి రిక్షా ఎక్కిపోయేరు.

* * * *

భాస్కర్ అత్తవారింటికి పండక్కి వచ్చినా ఎవరితోనూ కలుపుగోరుగా మాట్లాడలేదు. అందరితోనూ ముభావంగానే వుంటున్నాడు. ఈ కాలంలో అల్లుళ్లు అత్తవారింట్లో ఎంత ముక్తసరిగా మాట్లాడితే అంత మంచిదనుకున్నాడు భాస్కర్.

'అమ్మా బావగారు చాలా మారిపోయారమ్మా. మునుపటిలా ఎవరితోనూ సరదాగా మాట్లాడ్డటంలేదు,కొంచెం

గర్వం, అతిశయంకూడా జోడుకూడినట్టున్నాయి.' తల్లితో ఫిర్యాదు గా చేసేడు భాస్కర్ బావమరిది రవి.

'ఒరే రవీ! బావగారే కాదు. సుశీలా కూడా చాలా మారిపోయింది. వచ్చిన దగ్గరనుంచీ సరదాగా ఒక్క ముక్కకూడా నాతో మాట్లాడలేదు. మీ నాన్నగారు చెప్పేరులే ఆ కోపమంతా క్రిందటిసారి మనం పండక్కి ఖరీదైన వేవీ పెట్టలేదని' కూరల సంచిని ముందేసుకుని కూర్చుని కూరలను తరుగుతూ అంది కామాక్షి.

తల్లిమాటలు పూర్తికాకుండానే 'అవునమ్మా, చిన్న బావగారికి ఖరీదైన సూటు ట్రాన్సిస్టర్ ఇచ్చేము. పెద్దబావగారికి బట్టలు, ఒక్కటీను వాచీయే ఇచ్చేము, మరి వాళ్ళకి కోపంరాదూ! పెద్దబావగారివైపు సపోర్టు చేస్తున్నట్లుగా మాట్లాడేడు రవి.

ఇంతలో సుశీల అక్కడికి రావడంతో రవి అక్కడి నుంచి లేచి వెళ్లిపోయేడు.

ఆ రోజే దీపావళి పండుగ.

అప్పుల వాళ్లైనా వూరుకుంటారు గాని ఈ అల్లుళ్లు వూరుకోరు. నీవు నాకున శత్రువ నిలా దాపురించేవు అని కసితీరా మనసులో సణుక్కుంటూ పైకి 'భాస్కర్! ఇదిగో నీ పండుగ ప్రజెంటేషన్' అంటూ కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్న అల్లుడికి ట్రాన్సిస్టర్ అందించేరు పరంధామయ్యగారు.

భాస్కర్ నవ్వుతూ దానిని అందుకున్నాడు. ఆ సమయంలో భాస్కర్ ఈ ప్రపంచమంతా జయించినరాజులా సంతోష పడిపోయేడు.

'నాయనా! భాస్కర్! మా పెట్టుపోతల్లో ఏవైనా లోపాలుంటే క్షమించు, అంటూ అమ్మాయి యివిగో అల్లుడికి, నీకు బట్టలు' కూతురిముఖాన బొట్టువుంచి చేతి కందించింది కామాక్షి.

భాస్కర్ బట్టలు ఎలాంటివి పెట్టేరో అని భార్య చేతిలోని బట్టలవైపు ఒకసారి చూచేడు. అతని చూపులు తారాజువ్వల్లా దూసుకుపోయి ఆ బట్టలమీదే నిలిచిపోయేయి. సుశీలకి కంచి పట్టుచీరె, తనకు ఖరీదైన సూటు. పరవాలేదు అని భాస్కర్ మనస్సు సంతృప్తితో నిండిపోయింది. అతని పెదవులపై మృదుమధుర దరహాస రేఖలు వెల్లివిరిసి చిందులు వేస్తున్నాయి. అతని కళ్లు తృప్తితో మెరిసిపోతున్నాయి. రేఖలు వెల్లివిరిసి చిందనలు వేస్తున్నాయి.

ఆ మరునాడు ట్రైన్‌కే వెళ్లిపోయేరు భాస్కర్, సుశీల.

ఆ రోజు పరంధామయ్యగారు హాలులో వాలు కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు.

ఇంతలో 'పోస్టు' అన్న కేక వేసి పోస్టుమేన్ పరంధామయ్యగారి కుర్చీదగ్గరికి ఉత్తరాన్ని విసిరేసి వెళ్లిపోయేడు.

పరంధామయ్యగారు కవరును విప్పి చూసి 'కామాక్షీ అల్లుడు వుత్తరం వ్రాసేడు' అంటూ వంటింట్లోనికి వినిపించేలా గట్టిగా కేక పెట్టేరు.

'పెద్ద అల్లుడిదగ్గరనుంచా?' లోపల్నుంచి వస్తూనే ప్రశ్నించింది కామాక్షి.

'పెద్దల్లుడే వ్రాశాడు చదువుతాను.' అంటూ చదవడం ప్రారంభించేడు. మామగారికి, అత్తగారికి మీ అల్లుడు మనస్కరించి వ్రాయునది.

మేము మొన్ననే ఇక్కడకు కులాసాగా చేరుకున్నాము. మీరు మాయింటికి వచ్చినప్పుడు నేను మీ అమ్మాయిమీద రుసరుస లాడుతూ వుంటే మీరు నన్ను మనసులో తిట్టుకుని, సుశీలను నేను బాధపెడుతున్నానని, సరిగ్గా చూడటంలేదని మీరనుకున్నారుకదూ? అదంతా ట్రాన్సిస్టర్ కోసం మేము ఆడిననాటకం అంతే. ఆ నాటకంలో నేను...హీరో, మీ అమ్మాయి హీరోయిన్. మీ అమ్మాయికూడా నాతో సహకరించి తన పాత్రను చక్కగా పోషించింది. మేము అసలు ఎప్పుడూ పోట్లాడుకోము, ఈ మారు పండక్కి మిమ్మల్ని ట్రాన్సిస్టర్ అడగాలనుకున్నాను. కాని మీ ఎదురుగుండా అడగటానికి మొహమాట పడి, మీ దగ్గరనుంచి అది రాబట్టడానికి ఇలా నాటక మాడేము అంతే. ఈ నాటకంలో మిమ్మల్ని మేమిద్దరం ఏమైనా మాటలతో బాధించి నట్లైతే మనసారా క్షమించవలసిందిగా కోరుకుంటున్నాము.

—భాస్కర్.

'ఏమిటి! అమ్మాయి ఇంటిలో నేను చూసినదంతా ఒట్టి నాటకమా!'అని పరంధామయ్యగారు ఆశ్చర్యంతో నోరు తెరచేసి అలాగే కొంచెంసేపు రెప్పవాల్చడం కూడా మరచిపోయి అలాగే ఆ వుత్తరంవైపు చూస్తూ వుండిపోయేడు.

'ఏమి విడ్డూరం, అల్లుడు గడుసువాడేనండీ' అంది కామాక్షి ఆశ్చర్యాన్ని ముఖంలో ప్రస్ఫుటింపజేస్తూ.

కొంచెం సేపటికి పరంధామయ్యగారు తేరుకుని 'మన అల్లుడు చిన్నప్పుడు నాటకాలు వేసేవాడు, ఫస్టు ప్రయిజ్ అన్నీ నేనే కొట్టేసే వాడిని అని ఒకసారి చెప్పేడు నీకు జ్ఞాపకముందా! ఆ కళ యిప్పుడు అల్లుడికి బాగా పనిచేసింది. అమ్మాయికీ కూడా ఏక్షన్‌లో అల్లుడు మంచి ప్రాక్టీసిచ్చేసేడు, ఇద్దరూ నాటకాన్ని రక్తి కట్టించేరు కామాక్షీ' అంటూ ఫక్కున నవ్వేరు.

కామాక్షీకూడా 'మంచి అల్లుడినే సంపాదించేము' అని బుగ్గలు నొక్కుకుంటూ గట్టిగా నవ్వేసింది,